క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌తో గురుబ్రహ్మం

చింతలపూడి: వైఎస్సార్ సీపీ తాడేపల్లి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మాగసాని గురుబ్రహ్మం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను దీటుగా ఎదుర్కోవాలని అధినేత జగన్ సూచించారని గురుబ్రహ్మం తెలిపారు. బీసీలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని చెప్పారు.

అయ్యప్పస్వామికి పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి వారి ఆలయంలో బుధవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పూజిత ఎంపిక



కానూరి పూజిత

చింతలపూడి : మండలంలోని జిల్లా పరిషత్ (సుబ్బరాజు) హైస్కూల్ విద్యార్థిని కానూరి పూజిత పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులు సాధించి మొదటి విడత కౌన్సిలింగ్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ప్రధానోపాధ్యాయులు బి.విజయ భారతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల కన్వీనర్ కొఠారు మోహన్ కుటుంబాన్ని ఆ పార్టీ కామవరపుకోట నాయకులు బుధవారం పరామర్శించారు. మోహన్ తండ్రి సూర్యనారాయణ ఇటీవల మృతి చెందారు. బుధవారం తోచలక గ్రామంలో మోహన్ ఇంటికి వెళ్లిన నాయకులు సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిన కనకరాజు, మేడంకి విజయరావు, మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆరుగురు చేరిక



సింగగూడెంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న దృశ్యం

లింగపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి.. నాణ్యమైన విద్య పొందండి అన్న నినాదంతో సింగగూడెం ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఒక్కరోజే ఆరుగురు విద్యార్థులు పాఠశాలలో చేరారని తెలిపారు. ఉపాధ్యాయులు ఆశాపు అప్పారావు, అంగన్‌వాడీ ఉపాధ్యాయిని సునీత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాహనాల వేలం వాయిదా

జంగారెడ్డిగూడెం: ఈ నెల 25న నిర్వహించాల్సిన వాహనాల వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని స్థానిక ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఎప్పుడు వేలం నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కామవరపుకోట: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ఏలూరు జిల్లా నాయకులు ములకాల సత్యనారాయణ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 30న సాయంత్రం విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో పార్టీ నిర్వహించే భారీ మహాసభను క్రైస్తవులు, దళిత క్రైస్తవులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన భక్తుడు నిమల రాము బుధవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

తెరిపివ్వని వర్షం.. రోడ్లు జలమయం



ద్వారకాతిరుమల : పంగిడిగూడెం వద్ద రహదారిపై వర్షపు నీటిలోంచి వెళుతున్న ఆటో



ద్వారకాతిరుమల : విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ద్వారకాతిరుమల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా బుధవారం క్షేత్రానికి వెళ్లే భీమడోలు – ద్వారకాతిరుమల ప్రధాన రహదారిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంగిడిగూడెంలోని పెట్రోల్ బంకు సమీపంలో, గొల్లగూడెం వద్ద, స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఆ ప్రాంతాలు కాలువలను తలపిస్తున్నాయి. వాహనాల వర్షపు నీటిలోంచే రాకపోకలు సాగుతున్నాయి. శ్రీవారి దర్శనార్థం వివిధ వాహనాలపై క్షేత్రానికి వస్తున్న భక్తులు వర్షం కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

చింతలపూడి మండలంలో భారీ వర్షం

చింతలపూడి : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా మబ్బులు కమ్మి ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఈ వర్షంతో సేదతీరారు. ఏలూరు – చింతలపూడి, చింతలపూడి – సత్తుపల్లి రహదార్లపై వర్షపు నీరు ప్రవహించింది. చింతలపూడి పట్టణంలోని మారుతీ నగర్ , గణేష్ కాలనీ ఏరియాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షాలకు రోడ్లపై గోతులు ఏర్పడి అధ్వానంగా మారాయి.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం విస్తారంగా కురుస్తోన్న వర్షాలకు జ్వరాలు పెరిగాయని, ఈ నేపథ్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుల బృందం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్ల బారిన పడి అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, తగరం బాబూరావు, సరియం రామ్మోహన్‌రావు, బన్నే వినోద్, మల్లం చలపతి, గాడి మారయ్య, మామిడి మురళి, తదితరులు పాల్గొన్నారు.

వీడని వాన



చింతలపూడి : రేచర్ల గ్రామం వద్ద చింతలపూడి – సత్తుపల్లి రహదారిపై నిలిచిన నీరు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం ఉదయం నుంచి ఎడతెరపులేకుండా వాన కురుస్తునే ఉంది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఉదయం 8:30 గంటల సమయానికి బుట్టాయగూడెంలో 11.6 మిల్లీ మీటర్లు, కొయ్యలగూడెం మండలంలో 6.8 మిల్లీ మీటర్లు, జీలుగుమిల్లి మండలంలో 6 మిల్లీ మీటర్లు, పోలవరం మండలంలో 8.8 మిల్లీమీటర్లు, కుక్కునూరు 8.6 మిల్లీమీటర్లు, వేలేరుపాడులో 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామవరపుకోట: రావికంపాడు గ్రామానికి 24 గంటల విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం గురువారం నుంచి సోమవారం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కొయ్యలగూడెం: కాలనీవాసుల సమస్యల (జగనన్న కాలనీ) పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. పరింపూడి గ్రామ పంచాయతీ, రెవెన్యూ పరిధిలో గల చేపల వారి వీధి శివారున వైఎస్సార్ సీపీ హయాంలో 188 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి సురేష్, ఈవోపీఆర్‌డీ సతీష్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూర్య, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

అన్నప్రసాద వితరణ



దాతను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అన్నప్రసాదాన్ని స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. అన్నప్రసాద వితరణ చేశారు. సుమారు 2,300 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యు లు తెలిపారు. అన్నప్రసాద వితరణకు సహకరించిన దుర్గ భవానీ ఫ్యాబ్రికేషన్స్ వర్క్స్ చిలకమర్తి రామదేవుడు, ఎం.వీరబాబు, కుటుంబసభ్యులును సత్కరించారు.

నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మానవత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తొమ్మిదో వార్డు ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, అట్టలు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మండపాటి రామకృష్ణ, కార్యదర్శి తిరిగిపల్లి చంటిబాబు, కోశాధికారి చవ్వా రాము, స్కూల్ ఉపాధ్యాయలు శివ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుతో భక్తులకు ఇబ్బందులు

జంగారెడ్డిగూడెం: డంపింగ్ యార్డు, సరైన రహదారి సౌకర్యం లేక బైనేరు ఉమా సహిత రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆలయ ప్రధానార్చకులు మేడూరి వెంకట రమాసుబ్రహ్మణ్య రవితేజ శర్మ తెలిపారు. జంగారెడ్డిగూడెం బైనేరు శివాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆలయానికి ఉత్తరాన ఉన్న డంపింగ్ యార్డు వల్ల మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఆరు నెలల క్రితం చెత్త రీసైక్లింగ్ కోసం యంత్రాన్ని ఏర్పాటు చేశారని, నాటి నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు రహదారి సౌకర్యం సరిగా లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆలయానికి దక్షిణం వైపు ఉన్న మట్టి రోడ్డుపై



మాట్లాడుతున్న ప్రధానార్చకులు రవితేజశర్మ, ఆలయ కమిటీసభ్యులు

గోతులు ఏర్పడి వర్షాకాలం కావడంతో బురదమయంగా మారి భక్తులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. టైర్ల ఫ్యాక్టరీ ఏర్పాటుతో కాలుష్యం పెరిగిపోయిందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, డంపింగ్ యార్డుతో పాటు రహదారి సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.

నూతన కమిటీ ఏర్పాటు

ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రవితేజశర్మ తెలిపారు. అధ్యక్షుడిగా ఊదా రాంగోపాల్, ఉపాధ్యక్షుడిగా పెందుర్తి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కాటేపల్లి రుద్రేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా మేకా సింహాద్రి, సభ్యులుగా పరసా రాంబాబు, కొల్లేపర రజనీకాంత్, కొల్లేపర రాధాకృష్ణ, సోమగాని చంద్రకళ, బచ్చు రామ్మోహన్‌రావులను ఎన్నుకున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా శిఖర నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని, భక్తులు గమనించాలని కోరారు. దాతలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.

ఆసుపత్రి ఎదుట రిలే దీక్ష ప్రారంభం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ నుంచి కనీస స్పందన లేకపోవడంతో రిలే దీక్షకు పూనుకున్నామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు తెలిపారు. దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు ప్రారంభించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూసపాముల విగ్నేష్, నాయకులు వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హాస్పిటల్ ఎదుట దీక్ష చేస్తున్న కార్మికులు

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

కుక్కునూరు: ఏజెన్సీ మండలాల్లో సర్కారు బడులు సమస్యలకు నిలయంగా మారాయని సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభంలోనే మండలంలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారని, వారి స్థానాలను భర్తీ చేయకుండా విద్యా శాఖ అలసత్వం వహిస్తోందని ఆరోపించారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని తెలిపారు. సరైన వసతులు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారని వివరించారు. విద్యాశాఖ తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి కూరాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



కుక్కునూరు ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

జంగారెడ్డిగూడెం: జూలై 9న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. కార్మిక ఉద్యోగ రైతు సమస్యలపై నిర్వహించే సమ్మె కరపత్రాన్ని బుధవారం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక వర్గానికి కనీస వేతనం రూ.26 వేలు చేయాలని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం వెంకటరెడ్డి, సీహెచ్ ప్రసాద్, సీహెచ్ జగన్, వై.సూరిబాబు, కానూరి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె కరపత్రం విడుదల చేసిన నాయకులు

పోడు భూములకు పట్టాలివ్వాలి

కుక్కునూరు: ఏజెన్సీలో పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలివ్వాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. ఫారెస్ట్ రేంజర్‌కు, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. 2006 అటవీ హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పోడు సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు కొందరికి పోడు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆదివాసీలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని తెలిపారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలివ్వాలని, లేని పక్షంలో వేలాది మందితో చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్, నాయకులు సిరికొండ రామారావు, కె.వీరస్వామి, కె.ముత్యాలరావు, ఎస్ చందర్‌రావు, కె.కల్లయ్య, ఎస్ విజయ, నార్లవరం ఎంపీటీసీ రత్తమ్మ, సర్పంచ్ రంగమ్మ,కె సత్తిబాబు, వి.రవి, ఎస్‌కే మున్ని తదితరులు పాల్గొన్నారు.



ఫారెస్ట్ రేంజర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నవధాన్యాల సాగుతో భూమికి మేలు

కామవరపుకోట: నవధాన్యాలు సాగు చేసి భూమిలో కలపడం ద్వారా భూమి సారవంతంగా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. బుధవారం తాడిచర్ల, సాగిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. అధికారులు రైతులతో కలిసి వరి నారుమడులను పరిశీలించి, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు సాగు చేస్తున్న నవధాన్యాల పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. కార్యక్రమములో సర్పంచ్ పార్థసారథి, ఉప సర్పంచ్ శైలజ, వ్యవసాయ సహాయకులు లీలరాణి, సిందూర, పశుసంవర్ధక శాఖ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

లింగపాలెం: మండలంలోని అయ్యప్పరాజుగూడెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులను సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్, వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రాగోలు పరిశోధన స్థానానికి చెందిన ఆర్‌జీఎల్ 7030, ఆర్‌జీఎల్ 7034 రకాల విత్తనాలను రైతులకు అందజేశారు. పచ్చిరొట్ట పైర్ల వల్ల ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో అయ్యప్పరాజుగూడెం, ధర్మాజీగూడెం గ్రామ పెద్దలు, రైతులు, రైతు సేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.



తాడిచెర్లలో నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న దృశ్యం

వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేయించాలి

లింగపాలెం: గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లో వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేయించాలని కార్యదర్శులను డీపీఓ కె.అనురాధ ఆదేశించారు. బుధవారం లింగపాలెం మండలం యడవల్లి, లింగపాలెం, ధర్మాజీగూడెం, కొణిజర్ల గ్రామాల్లోని డంపింగ్ యార్డులను డీపీఓ అనురాధ, ఎంపీడీఓ కె.వాణి, డిప్యూటీ ఎంపీడీఓ సుందరి పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ అనురాధ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించి వాటి ద్వారా ఎరువులు తయారు చేయాలని అన్నారు. వర్మీ కంపోస్ట్ ఎరువులను కూడా తయారుచేసి పంచాయతీలను ఆదాయాలను సమకూర్చుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కానుండటంతో గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, పెంట కుప్పలను తొలగించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పైప్ లైన్ లీకేజీలు అరికట్టాలన్నారు. డీపీఓ కొణిజర్ల గ్రామంలోని డంపింగ్ యార్డ్‌లో పంచాయతీ చేపట్టిన వర్మి కంపోస్ట్ ఎరువుల తయారీని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌లో మొక్కను నాటారు. స్పెషల్ శానిటేషన్‌పై లింగపాలెం మండల కార్యదర్శులతో డీపీఓ ధర్మాజీగూడెం సచివాలయంలో సమీక్షించారు. శానిటేషన్‌పై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుగుణ రావు, పాపారావు, స్వరాజ్యలక్ష్మి, జస్వినిత తదితరులు ఉన్నారు.



కొణిజర్లలో వర్మి కంపోస్ట్ ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ అనురాధ, అధికారులు

విఘ్నేశ్వరరావుకు మాజీ మంత్రి పరామర్శ

ద్వారకాతిరుమల: మండలంలోని వెంకటకృష్ణాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంటా విఘ్నేశ్వరరావును మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత బుధవారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడిపోయి తీవ్ర గాయాలపాలై ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విఘ్నేశ్వరరావును వనిత పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, సీహెచ్ పోతేపల్లి సర్పంచ్ పోల్కంపల్లి అనీల్, భోగరాజు సాయికృష్ణ, నల్లజర్ల మండల పార్టీ కన్వీనర్ వెల్లంకి సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.



విఘ్నేశ్వరరావును ఆస్పత్రిలో పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత, నాయకులు

7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కొయ్యలగూడెం: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న నిర్వహించనున్నట్టు పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి విస్సంపల్లి సిద్ధు మాదిగ తెలిపారు. కార్యక్రమాన్ని ఎంఆర్‌పీఎస్ శ్రేణులు విజయవంతం చేయాల్సిందిగా యర్రంపేటలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పిలుపు ఇచ్చారు. సర్పంచ్ సీహెచ్ యేసు రత్నం మాదిగ, కూచిపూడి సత్యం మాదిగ, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై దాడి

కుక్కునూరు: కార్మికుల హక్కులపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం నడవడం సిగ్గుచేటని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ విమర్శించారు. బుధవారం కుక్కునూరులో సాయికిరణ్ మాట్లాడుతూ చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో కార్మికుల 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. అధిక సమయం అనేది కార్మికుల ఇష్ట ప్రకారం చేయాల్సిన అదనపు పని అన్నారు. ఆచరణలో దానిని యాజమాన్యాలు కార్మికుల పాలిట నిర్బంధంగా మార్చేశాయని వివరించారు. మహిళలకు నైట్ షిఫ్టుల భారాన్ని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.